జానపద కళాకారునికి రూ.50వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మందస : జానపద కళలను పర్యవేక్షించడానికి సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అన్ని విధాలుగా ప్రయత్నిస్తుందని వేదిక గౌరవ సలహాదారుడు డాక్టర్ కుమార్ నాయిక్, రాపాక ధనరాజులు అన్నారు.

శనివారం సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో హరిపురం గ్రంథాలయం ఆవరణలో జానపద గాయకుడు గువ్వాడ మల్లేసుకు 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వాడ మల్లేసు పాడిన లింగిడి.. లింగిడి..లింగిడి క్రింద జంగిడి పాటను కోటబొమ్మాళి సినిమాలో వాడుకున్నందుకు గాను సినీ నిర్మాతలు బన్ని వాసు, కొప్పినేని విద్యలతో సంప్రదించి ఆర్థిక సహాయాన్ని అడిగామని వారు తక్షణమే స్పందించి 50వేల రూపాయలను మల్లేసుకు అందజేయాలని కోరానన్నారు. ఉద్దాన ప్రాంతంలో ప్రాచీన జానపద కళాఖండాలు కవితలు, జానపద కళలు, నిక్షిప్తమై ఉన్నాయని, వాటిని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. యాచకవృత్తిని జీవనంగా సాగిస్తున్న గువ్వాడ మల్లేసుకు సినీనిర్మాతలు ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వేదిక కోశాధికారి మామిడి క్రిష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తిని రామారావు, ఉపాధ్యక్షులు దున్న రామారావు, గౌరవాధ్యక్షులు బొడ్డు గాంధీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.లోకేశ్వరరావు, దున్న హరిక్రిష్ణ, పోతనపల్లి మాధవరావులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి : ఎస్ఐ హరిక్రిష్ణ

విశాలాంధ్ర-మందస :రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రహదారి భద్రతా నియమాలు పాటించాలని మందస ఎస్.ఐ సి.హెచ్.హరిక్రిష్ణ సూచించారు. శనివారం మందస ఆటో యూనియన్, డ్రైవర్ల సంఘం సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణానికే ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఓవర్ లోడ్ అనుమతించవద్దని, ముఖ్యంగా స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే ఆటోలు, నాలుగు చక్రాల వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. స్కూల్ జోన్‌లో వాహనాలు నెమ్మదిగా నడపాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు పాటించాలని, లేకపోతే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో 11 దుఖాణాల్లో చోరీ

రూ.1.20 లక్షలు నగదును దోచుకున్న దొంగలు

విశాలాంధ్ర-పలాస : ఎంతో ప్రశాంతంగా ఉన్న పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని దొంగలు భీభత్సం సృష్టించారు. నిత్యం రద్దీగా ఉండే కాశీబుగ్గ పాత బస్టాండ్ ప్రాంతంలోని మహత్మగాంధీ షాపింగ్ కాంప్లెక్స్, ఐడిఎస్ఎంటి దుఖాణాల సముదాయంలో ఉన్న 11 దుఖాల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు చోరీకి పాల్పడి పలు దుఖాణాల్లో వ్యాపారులు ఉంచుకున్న నగదు సుమారు లక్షా 20వేల రూపాయలు వరకు దోచుకెళ్లినట్లు వ్యాపారులు తెలిపారు. శనివారం వ్యాపారులు దినచర్యలో భాగంగా తమ దుఖాణాలు తెరిచేందుకు వచ్చిన సమయంలో ఆయా దుఖాణాల తాళాలు బద్దలుగొట్టి ఉండడంతో దొంగతనాలు జరిగినట్లు గుర్తించారు. కొన్ని దుఖాణాలల్లో వ్యాపారులు కౌంటర్‌లో ఉంచిన 10వేలు నగదు నుంచి 20వేలు వరకు చోరీకీ గురైనట్లు వ్యాపారులు తెలుసుకొని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కాశీబుగ్గ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న మహత్మగాంధీ కాంప్లెక్స్, ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్సులు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న రాత్రి సమయంలో 11 దుఖాణాల్లో ఒకేసారి చోరీకి పాల్పడడం సంచలనం కలిగించింది. రాత్రి సమయాల్లో గస్తీ తిరుగుతున్న పోలీసులకు ఏ మాత్రం అనుమానం కాకుండా దొంగతనాలు జరగడం విస్తుపోతున్నామని పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో ఈ సంఘటన రుజువు చేస్తుందని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి మేలుకో-భవిష్యత్తు కాపాడుకో

పోస్టర్ ఆవిష్కరించిన కూన రవికుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి మేలుకో-భవిష్యత్తు కాపాడుకో కరపత్రాన్ని మాజీ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కూన రవికుమార్ స్థానిక 80అడుగుల రోడ్డులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా తెలుగుదేశం ప్రభుత్వంలో విద్యార్థులకు చేసిన మేలు, వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులు చేసిన దగా కరపత్రం ద్వారా అన్ని కళాశాలల వద్ద కరపత్రం అందజేసి టీఎన్ఎస్ఎఫ్ ద్వారా వివరించడం జరుగుతుందన్నారు. అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడంతో దాదాపు 23 వేల మంది నిరుద్యోగులు, 120 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇవి జగన్ రెడ్డి హత్యలు కాదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హెూదా తెచ్చి ఉద్యోగాల విప్లవం తెస్తానని రెచ్చగొట్టి నేడు కేంద్రానికి దాసోహమై యువత విద్యార్థుల జీవితాలను బలిపీఠం పైకి నెట్టారని అన్నారు. అమ్మ ఒడి-నాన్న బుడ్డి.. ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి కింద ఏటా రూ.15వేలు ఇస్తానని హామీ ఇచ్చి నేడు 82 లక్షల మంది విద్యార్థులు ఉంటే దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు ఎగ్గొట్టారని, 15 వేలను కాస్త 13 వేల కుదించారని, అమ్మఒడి కింద 25 వేల కోట్లు ఇచ్చి లక్ష కోట్లు నాన్న బుడ్డి ద్వారా దోచేశారన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ టిడిపి ప్రభుత్వం ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు 5 ఏళ్లలో ఇస్తే.. జగన్ రెడ్డి తొమ్మిది లక్షలు మంది విద్యార్థులకు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఎల్‌కెజీ టు పీజీ వరకు ప్రతి విద్యార్థిని దగా చేసిన వ్యక్తి జగన్ రెడ్డి అని దుయపట్టారు. విద్యార్థి మేలుకో భవిష్యత్తు కాపాడుకో ప్రోగ్రాం ద్వారా ప్రతి విద్యార్థిని కలుసుకొని కరపత్రం అందజేసి వారి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ విడుదల చేసిన శ్రీకాకుళం పార్లమెంటు అధ్యక్షులు కూన రవికుమార్ రాష్ట్ర పార్టీ వజ్జా బాబురావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు. గోర అనిల్ ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బలగ ప్రహర్ష, రెడ్డి శంకర్, యాల వరుణ్, శ్యామలరావు, సాదు అజయ్, ఎన్ని శ్రీకాంత్, అనిల్ కోల సింహాచలం, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలసిన జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు పోర్టు పోలియో జడ్జి జస్టిస్ జి రామకృష్ణప్రసాద్, జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో జిల్లా బార్ అసోసి యేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శనివారం స్థానిక సన్‌రైజ్ హెూటల్‌లో హైకోర్టు న్యాయమూర్తులను కలుసుకొని ఇతర న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. న్యాయమూర్తులను మర్యాద పూర్వకంగా కలుసుకున్న వారిలో మూడవ అదనపు జిల్లా జడ్జి పి. భాస్కరరావు, డీఎల్ ఎస్ ఎ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్ సన్యాసినాయుడు, ప్రోటోకాల్ జడ్జి కందికట్ల రాణి, సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ కె. అప్పిసునాయుడు, కూన అన్నంనాయుడు, పీవీ రమణ దయాల్, మామిడి క్రాంతి, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు జి. చంద్రమౌళి, ఎం భవానీ ప్రసాద్, వి హరిప్రియ, గంగుల భాస్కరరావు, సనపల హరి, ఎఎల్ నారాయణ, పొన్నాడ వెంకటరమణారావు, కె.సూర్యం తదితరులు న్యాయమూర్తులకు కలుసుకున్నవారిలో ఉన్నారు. ఈసందర్భంగా న్యాయమూర్తులకు జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు అరసవల్లి సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని బహుకరించి దుశ్శాలువతో సత్కరించారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని టెక్కలి, పలాస డివిజనల్ అధికారి ఐ.వి.రమణ అన్నారు. శనివారం గరుడభద్ర సచివాలయంలో సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామానికి అనుకొని ఉన్న చెత్త సందప తయారీ కేంద్రాన్ని పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బి.మోహనరావు, ఆర్.కళ్యాణి, వై.అవినాష్, కె.వెంకటేష్, బి.స్వాతి, ఊర్వశిలు పాల్గొన్నారు.

మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి వుండాలి

వైసిపి, సిఈసి సభ్యురాలు, ధర్మాన పద్మప్రియ

విశాలాంధ్ర-నరసన్నపేట : మహిళలు చట్టాల పట్ల అవగాహన కల్గివుండాలని వైసిపి సిఈసి సభ్యురాలు, ధర్మాన పద్మప్రియ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ హింస వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా డ్వాక్రా మహిళలను ఉద్దేశించి పద్మప్రియ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పట్టణంలో మహిళలు నిర్వహించిన ర్యాలీకి పద్మప్రియ పచ్చ జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షురాలు, సవర శైలజ, వెలుగు కోఆర్డినేటర్, కొండలరావు, ఏపిఎం, హేమసుందర రావు, సిసి, ఉమ, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాశ్వత ధర్మకర్త మహారాణి కళ్యాణి గజపతికి ఆహ్వానం

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో ఆదివారం నిర్వహించే కార్తీక పౌర్ణమి శిఖర దీపం ఆకాశదీపోత్సవానికి శాశ్వత ధర్మకర్త మహారాణి కళ్యాణి గజపతిని పురోహితులు ఆహ్వానించామన్నారు. ఆమె పేరున ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. తదుపరి మహారాజు ఇచ్చిన ఆలయ భూములు, స్వామివారి ఆభరణాలకు సంబంధించిన సమగ్ర విషయం గురించి ఆమెతో సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు.

దొర అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు : మండలం, తొగిరి గ్రామం, మండల సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యులు నామగిరి జగనాథ్ దాసు (దొర గారు) శుక్రవారం రాత్రి గుండె పోటుతో స్వర్గస్తులైనారు. శనివారం నరసన్నపేట టీడీపీ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి వారి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, సారవకోట మండల నాయకులు తదితరులు ఉన్నారు.

సంతబొమ్మాలిలో ఓట్లు సరిచేసే కార్యక్రమంలో అధికారులు బిజీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఓటర్ లిస్టులో పలు అంశాలపై దృష్టి సారించి, సరిచేసే కార్యక్రమంలో సంతబొమ్మాళి తహసిల్దార్ కార్యాలయంలో అధికారులు బిజీగా ఉన్నారు. గత కొద్ది రోజుల నుంచి మండలములో కల బిఎల్‌ఓలు అధికారులు ఒక్కో ఓటర్ వివరాలు సేకరించి, ప్రింట్ తీసి, సరి దిద్దుతున్నారు. తహసిల్దార్ జి చలమయ్య పర్యవేక్షణలో ఓటర్లు చిరునామాలు తేడా, రెండు చోట్ల తో పాటు పలుచోట్ల ఓటర్లుగా నమోదయ్యే వివరాలు సేకరించి కార్యక్రమం చేస్తున్నట్లు తాసిల్దార్ చలమయ్య తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 729 మంది ఓటర్లుకు, చిరునామాలు, పలుచోట్ల వాటర్‌లు నమోదయ్యే సంఖ్యను సరిదిద్ది ఆ యా ఓటర్లకు పోస్టులో కవర్ ద్వారా పంపించడం జరిగిందని తహసిల్దార్ తెలిపారు.

సచివాలయాల నిర్మాణాలు త్వరితిగతిగా పూర్తి చేయాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్మాణాలు చేపడుతున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, పాల కేంద్రాలు డిసెంబర్ 31 తేదీ నాటికి నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఎంపీడీవో పీ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ఇంజనీరింగ్ అధికారి పి ప్రవీణ్, గృహ నిర్మాణ శాఖ ఏఈ సాయి తో కలిసి సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఇల్లు నిర్మాణాలు త్వరితిగతిగా పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: విజయవాడలో ఈ నెల 27, 28 తేదీలలో జరిగే మహాధర్నాలో కార్మికులు, కర్షకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఏ.ఐ.టి.యు.సి. జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖ రావులు కోరారు. శనివారం శ్రీకాకుళం మండలం సింగుపురం గ్రామంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజులు ధరలు తగ్గిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, విదేశాల్లో దాచుకున్న నల్లధనం వెనక్కి తెచ్చి ప్రతీ పేద కుటుంబానికి పదిహేను లక్షలు డిపాజిట్ చేస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఆచరణలో పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. నాలుగు వందలు ఉన్న గ్యాస్ పదకుండు వందలకు పెరిగిందని, ఎన్నికలు వస్తున్నందున రెండు వందలు ప్రస్తుతం తగ్గించారని అన్నారు. ధరలు ఆకాశానికి నిచ్చెనలు వేశాయని, సామాన్యులు నిత్యావసర సరుకుల కొనలేక అర్థాకలితో జీవిస్తున్నారన్నారు. సామాన్యులపై భారాలు మోపిన మోడీ ప్రభుత్వం అంబానీ, ఆధాని లాంటి కార్పొరేట్ కంపెనీలకు ఇరవై లక్షల కోట్లు అప్పులు రద్దు, వడ్డీ రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ధారాదత్తం చేశారని అన్నారు. 36 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి వేతనం అడిగే హక్కు, సంఘం పెట్టుకొనే హక్కు, సమస్యల పరిష్కారం కొరకు చర్చలు జరిపే హక్కులను మోడీ ప్రభుత్వం హరిస్తూ కార్మికుల పొట్టలు కొడుతుందని అన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయుటకు ఢిల్లీ రైతాంగ పోరాటం స్ఫూర్తితో కార్మిక, కర్షక, ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, స్థానిక రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

- **టెక్కలిలో...** ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే 30 గంటల మహాధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని ఏ.పి.రైతు సంఘం జిల్లా నాయకులు తమిరి భుజంగ రావు కోరారు. శనివారం టెక్కలి మండలం సొంపాపురం గ్రామంలో మహాధర్నా కరపత్రములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలను వివరించి మహా ధర్నా లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.వేణుగోపాల్, బి. మధన్, ఎస్.వెంకట రావు, పి. యర్రయ్య, పి.ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా సెక్టార్ అధికారులను నియమించి వారికి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘ మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. రిటర్నింగ్ అధికారులకు ఈ సెక్టార్ అధికారులు అనుసంధానమై ఉంటారని, ఒకొక్క రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని, ఒకో సెక్టార్ అధికారికి 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందని చెప్పారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఇస్తామని, సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ స్వయంగా సందర్శించి వసతులను, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని, సమస్యాత్మక అంశాలను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే తమ పరిధిలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ పరిస్థితులు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్‌హెచ్‌వోలను ఒకరికి ఒకరు పరిచయం చేసుకోవాలని, గ్రామాల్లో రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. ఎన్నికలకు ఎలక్టోరల్, ఈవీఎం, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది కీలకమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఎన్నికలనూ కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ తప్పిదాలకు ఎటువంటి ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని కలెక్టర్ కోరారు. మాస్టర్ ట్రైనీ జయ దేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు, ఆర్డీవో సిహెచ్. రంగయ్య ఎన్నికల నిర్వహణ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా పలువురి అనుమానాలు నివృత్తి చేశారు. అనంతరం ఈవీఎంల ద్వారా ఓటింగ్ విధానాన్ని వివరించారు. శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు ఎన్నికల విధుల కోసం నియమితులైన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు హాజరయ్యారు.

జిల్లా క్రీడల్లో సత్యవరం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-నరసన్నపేట : జిల్లాలోని కళింగపట్నంలో ఈనెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకూ జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో మండలంలో సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వకుల రత్నమాల తెలిపారు. బాలుర సీనియర్ విభాగంలో లాంగ్ జంప్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న డి.రామరాజ్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, కె.హరీష్ ద్వితీయ స్థానం సాధించాడు. ట్రిపుల్ జంప్‌లో కె.హరీష్ ప్రథమ స్థానాన్ని, వంద మీటర్ల పరుగులో ప్రథమ స్థానం డి.రామరాజు సాధించగా, ద్వితీయ స్థానం కె.హరీష్ కైవసం చేసుకున్నాడు. హైజంప్‌లో పదవ తరగతి చదువుతున్న పి.వరణ్‌కుమార్ ప్రథమ స్థానం సాధించారు. సీనియర్స్ బాలికల విభాగంలో లాంగ్ జంప్‌లో బి.ద్రాక్షాయని ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం ఎస్.హారిక, ద్వితీయ స్థానం, హైజంప్‌లో తృతీయ స్థానం బి.ద్రాక్షాయని సాధించారు. అలాగే బాలుర జూనియర్స్‌లో 1500మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం పి.లక్ష్మణరావు, 400మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం పి.లక్ష్మణరావు, జానకిరావు, భరణి కైవసం చేసుకున్నారు. క్రీడల్లో విజేతలకు, పి.డి, టి.ఆనంద్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియచేశారు.

18 ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆర్డీవో భరత్ నాయక్

విశాలాంధ్ర-పలాస : 18 ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, ఓటుహక్కు వినియోగించు కోవాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ యువతకు సూచించారు. కాశీబుగ్గ విద్యా వాహిని కళాశాలలో శనివారం ఓటు నమోదు ఓటరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఓటుపై చైతన్యపరిచి ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్న భ్రష్టు పట్టిన వ్యవస్థను చరమ గీతం పాడాలన్న, చెడ్డవారి ఆక్రందనలు తొలగించాలన్న ఈ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. అందుకు మీరు, మీ చేతిలో ఉన్న ఏకైక వజ్రాయుధం ఓటుని, ఇలాంటి ఓటును డబ్బు, కులము, మతం, ప్రాంతం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగ కుండా వినియోగించు కోవాలని కోరారు. ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా ప్రతీ ఒక్కరినీ నమోదు చేయించి, వాటి ప్రాముఖ్యాన్ని తెలియజేసి ఓటు హక్కుని వినియోగించి మంచి నాయకున్ని ఎన్నుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్ మధుసూదన్, శ్రీ విద్యావాహిని కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు, ఎలక్షన్ డిటి రాంబాబు, ప్రిన్సిపాల్ అయిదం గిరిబాబు, ఎఓ పైల. మన్మథరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నుంచి శబరిమలైకి ప్రత్యేక రైలు

జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-ఆమదాలవలస: జిల్లాలో అయ్యప్ప దీక్షలు చేపట్టే భక్తులు ఇకపై నేరుగా శబరిమలై చేరుకోవచ్చని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం మనోజ్ శర్మ ఇటీవల మంజూరు చేసిన ప్రత్యేక రైలును ఆయన శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ (ఆమదాలవలస)లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా నుంచి తొలిసారిగా కొల్లాంకు ప్రత్యేక రైలు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. భక్తులు ఇకపై తమ ఇరుముడిని పవిత్రంగా స్వామివారికి సమర్పించవచ్చని తెలిపారు. భక్తుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, కోరిన వెంటనే రైలును కేటాయించిన రైల్వే జీఎం, ఖుర్దా రోడ్డు, వాల్తేర్ డీఆర్ఎంలకు ఎంపీ కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణంలోని అయ్యప్పస్వాములతోపాటు నాయకులు ఎంపీ వెంట ఉన్నారు.

ప్రతిభగల క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యం

- జడ్పీ చైర్ పర్సన్ విజయ సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి: ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర పేరుతో ఆంధ్రప్రదేశ్ పభుత్వం పోటీలను నిర్వహిస్తుందని జడ్పీ చైర్పర్సన్ విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రమైన కవిటి మండల పరిషత్ కార్యాలయం వద్ద శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు మంజూరు కాబడిన వివిధ రకాల క్రీడల కిట్లను జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయసాయిరాజ్ చేతులు మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా పిరియా విజయ సాయిరాజ్ మాట్లడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర పేరుతో ఆంధ్రప్రదేశ్ పభుత్వం పోటీలను నిర్వహిస్తుందని అన్నారు. ప్రభుత్వం యువతలో క్రీడా స్ఫూర్తి పెంచాటానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మక0గా ప్రభుత్వ0 చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ప్రతినిది కడియాల ప్రకాష్, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మన్ రావు, వైస్ ఎంపీపి పూడి నేతాజీ, వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, ఏ ఎం సి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, ఎంపీటీసీ సభ్యులు పూడి నీలచలం, నర్తు శివాజీ, ఎన్ని అశోక్, దువ్వు కృష్ణ రెడ్డి, భార్ల నాగభూషణం, ఎంపీడీవో సూర్య నారాయణ రెడ్డి, ఈవో వీరభద్ర స్వామి, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న చలో ఢిల్లీ

వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

విశాలాంధ్ర-కొత్తూరు : డిసెంబర్ 4వ తేదీన చలో ఢిల్లీ మీట్ రాష్ట్రపతి నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సిర్ల ప్రసాద్ తెలిపారు. శనివారం ఇక్కడ దళిత సంఘాలతో కలిసి అట్టడుగు వర్గాలు కు రాజ్యాంగం కల్పించిన హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుంది. దళిత హక్కులు రక్షణ, సామాజిక న్యాయం, దళిత వర్గ సమస్యలపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కోటి సంతకాలతో మెమొరాండంను అందజేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల సంఘం నాయుకులు దుర్గాసి జమ్మయ్యా, బొమ్మెలి గుమ్మయ్యా, బొడ్డేపల్లి కృష్ణారావు, మోజురు రమేషబాబు త్రినాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన పాలవలస విద్యార్థులు

విశాలాంధ్ర-బూర్జ : ఇంటర్ స్కూల్స్ అథ్లెటిక్ అసోసియేషన్" శ్రీకాకుళం జిల్లా వారు ఈనెల 22న గ్రిగ్స్ పోటీలు నిర్వహించిన విషయం విదితమే. బూర్జ మండలం పాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అండర్ 17 కబడ్డీ బాలుర విభాగంలో మండల స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ ఎం ప్రతాపరుద్రుడు, పి ఈ టి గవరమ్మ శనివారం తెలిపారు. గెలుపొందిన జట్టు సభ్యులను పలువురు ఉపాధ్యాయులు స్థానికులు అభినందించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర-పొందూరు : 18 ఏళ్ళు నిండకుండా బాలికలకు వివాహం చట్టరాత్యే పెద్ద నేరమని ఎంపీడీవో ఎస్. హరిహరరావు, వెలుగు ఏపీ రవి అన్నారు. మండలకేంద్రంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలికలపై అఘాయిత్యాలపై పొందూరు పట్టణంలో డ్వాక్రా మహిళలతో బారీ ర్యాలీ నిర్వహించారు. బాలికలను ఏవిధంగా వేధిం చినా చర్యలు తప్పవన్నారు. బాల్యవివాహాలకు పాల్పడితే వరుడుతో పాటు వరుడు. వదువు తల్లిదండ్రులపైనా చర్యలు, కేసులు తప్పవని బాల్యవివాహాలను అడ్డుకోవలసిన బాధ్యత అంగన్వాడీ, ఐసీడీఎస్, రెవెన్యూ, మహిళాపోలీసులపైనా ఉందన్నారు. వారు అడ్డుకోవడానికి చర్యలు తీసుకోకపోతే వారిపైనా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించా రు. మండలపరిషత్ కార్యాలయంలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జి. శ్యామలరావు, ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం స్వర్ణయుగం

మాజీ ఎంపీటీసీ మక్క లక్ష్మణరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవు తుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని కొత్తపేట మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు మక్క లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. అలాగే ప్రతి ఇంటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానూ చేపట్టబోయే పథకాలు గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చేలా సూపర్ సిక్స్ పేరుతో మినీ మేనిఫెస్టో విడుదల చేశారు. ఇందులో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు, పిల్లలను స్కూల్స్‌కు పంపే తల్లుల కొరకు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాలు ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందని ఒక పత్రం మీ (బ్రాండ్) రాసి ఇంటింటికి తిరిగి ప్రజలకు అందజేస్తున్నాము అంటే చంద్రబాబు చిత్తశుద్ధి ఏంటనేది ప్రజలు గ్రహించి రాబోయే ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడును గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజమహంతి శ్రీనివాస్, రామపాత్రుని బాబురావు, ధర్మాన నాగరాజు, శ్రీనివాసరావు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం చీపుర్లపాడు, హరిశ్చంద్రపురం, తిలారు, సరియాపల్లి తదితర గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

ఈనెల 30వ తేదీన ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-నరసన్నపేట : ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ ది ప్రెసిడెంట్, మెంబర్స్ ఆఫ్ లయన్స్ క్లబ్ నరసన్నపేట మిల్లీనియం వారి సహాయంతో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సదాశివుని కృష్ణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో సత్య ఫంక్షన్ ప్లాజాలో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరంలో స్త్రీలకు ఉచిత గైనిక్ పరీక్షలు, పొగాకు, పాన్, గుట్కా అలవాటు వున్న పురుషులకు నోటి పరీక్షలు చేయబడునని తెలిపారు. 25సంవత్సరాలు పైబడిన స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఇతర క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయబడునని అన్నారు. అలాగే దీర్ఘకాలిక లక్షణాలు వున్న వారికి కూడా వైద్య పరీక్షలు చేయబడునని, ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ అధ్యక్షులు, కృష్ణ కోరారు.

ఓటర్లు ప్రతిజ్ఞ

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 69వ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లు ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పరచి భాగస్వామ్యం చేసే ప్రక్రియలో భాగంగా శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో గల 69వ పోలింగ్ స్టేషన్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన ప్రతిజ్ఞ ను ప్రత్యేకంగా యువ ఓటర్లచే 69వ పోలింగ్ స్టేషన్ బూత్ లెవల్ ఆఫీసర్ కన్యాకుమారి ప్రతిజ్ఞ చేయించారు.

హైకోర్టు న్యాయమూర్తులను మర్యాద పూర్వకంగా కలసిన కలెక్టర్, ఎస్పీలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కోర్టు నుండి జస్టిస్ యు.దుర్గా ప్రసాద్ రావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి న్యాయమూర్తులు జిల్లాకు పర్యటనకు విచ్చేసియున్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన హైకోర్టు కోర్టు న్యాయమూర్తులను శనివారం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

అదేవిధంగా స్థానిక జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో జరగనున్న జ్యూడిషియల్ వర్క్‌షాప్ మరియు న్యాయ సమీక్ష సమావేశానికి న్యాయమూర్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సన్ రైజ్ హోటల్ నందు జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పాఠశాలలో పని చేస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఎస్. జ్యోతమ్మ, ఎం.కృష్ణారావుకు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠ రావు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శించిన తిలక్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో గల పలు గ్రామాల్లో అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలకు రాష్ట్ర కళింగ కోర్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. కొత్తపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైయస్సార్ సిపి కార్యకర్త దుబ్బ రమేష్ (ఫీల్డ్ అసిస్టెంట్ దుబ్బ సింహాచలం అన్నయ్య), కళింగపట్నం క్రిష్ణ కుటుంబాలకు, అలాగే విశ్వనాధపురం పంచాయతీ సీతారాంపురంలో పంకు వరహాలమ్మ (కొత్తపల్లి యంపీటీసీ ప్రతినిధి పంకు రాము మాతృ మూర్తి) కుటుంబానికి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందర్రాజు, పేడాడ వెంకటరావు, బెలమర మహేష్, పంకు సింహాచలం, పిట్ట శ్రీనివాస్, కూన దాలప్ప, పేడాడ దామోదర్, కొండాల సిమ్మయ్య తదితరులు ఉన్నారు.

ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పలాస : గ్రామాల్లో ఇంటి పన్ను వసూలను వేగవంతం చేయాలని డివిజన్ పంచాయతీల విస్తరణ అధికారి ఐవి రమణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రం ఏయే పథకాలు ఇస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఏయే పథకాలు అందిస్తున్నాయి, వాటి ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్ నాయుడు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షత లేకుండా చూడాలి

విశాలాంధ్ర-పలాస : లింగ వివక్షత లేకుండా చూడాలని డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారి ఐవి రమణ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా వెలుగు మండల అధ్యక్షులు, విఓ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, సచివాలయం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. నేటి నుంచి నుంచి డిసెంబర్ 25 వరకు నెల రోజులు పాటు గ్రామాల్లో లింగ వివక్షత, బాల్య వివాహాలు, రక్త హీనత, ఆడ పిల్లల చదువుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ప్రతీ వారానికి ఒకసారి మండల స్థాయిలో ఒక్కొక్క అంశంపై సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటిపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, వెలుగు ఎపిఎం మల్లేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులు, వెలుగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్కివలస పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం లక్కివలస పంచాయతీలో సీనియర్ తెలుగుదేశం నాయుకుడు పిట్ట రాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా. 220 నెంబర్ పోలింగ్ బూత్‌లలో. పిట్టవానిపెట, గొలుగువాని పేట గ్రామాలలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు అందజేసిన పథకాలను తెలియజేశారు. అలాగే రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపడితే, ప్రజలకు ఎటువంటి పథకాలు అందజేస్తారు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు పిట్ట జగన్. శ్రీరంగం ఎర్రయ్య, మంకు కర్రయ్యతోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బి.సి. సంక్షేమం మరియు హక్కులు గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కొత్తపుట్టుగ ఎమ్మెల్సీ నర్తు రామారావు నివాసం వద్ద బి.సి. సంక్షేమం, హక్కులు గోడపత్రికను ఎమ్మెల్సీ నర్తు రామారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర బి.సి.సంక్షేమ సంఘం అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ అధ్యక్షతన మొదటిగా ఇచ్చాపురం నియోజక వర్గంలో డిశంబర్ 7 వ తేదీన బి.సి. సంక్షేమం మరియు హక్కులు గూర్చి రథయాత్ర ప్రారంభించబడునని తెలిపారు. బి.సి.సంక్షేమం మరియు హక్కులు గూర్చి రాష్ట్రం మొత్తం సుమారు 120 నియోజకవర్గాలలో ఈ రథయాత్ర జరుగునని తెలిపారు. ఈ రథయాత్ర ముగింపు తిరుపతి వెంకన్న సన్నిధిలో జరుగునని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి.సంక్షేమ జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అమిల్లా బేగ్, రాష్ట్ర బి.సి అధ్యక్షులు కాయతి వెంకటరమణ, స్టేట్ కన్వీనర్ బీన డిల్లీరావు, జిల్లా ఉపాధ్యక్షులు తిప్పన గాంధీ, స్టేట్ యూత్ కార్యదర్శి సాలిన. ప్రసాద్, పిట్ట హేమసుందర్, బీన.అశోక్, ఈరోతు. శ్రీనివాసరావు, కోట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండల సమైక్య ఆధ్వర్యంలో లింగ వివక్ష గూర్చి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నవంబర్ 25 నుండి డిసెంబర్ 22 వరకు మండల అధికారుల సహకారంతో గ్రామస్థాయిలో లింగ వివక్షత సంబంధించి విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాలని స్థానిక ఎంపీడీవో మురళీమోహన్ తెలియజేశారు. ప్రతి గ్రామంలోనూ మహిళా సంఘాలు, అంగనవాడి కార్యకర్తలు మరియు ప్రజా ప్రతినిధుల సహకారంతో ఎంపీడీవో ఆదేశాల మేరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని ఏపిఎం కమల కుమారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు రక్షకభటులు పాల్గొన్నారు.

నందిగాం: లింగ వివక్షత పై నందిగామలో ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాల నిర్మూలలపై శనివారం నందిగాంలో ర్యాలీ చేశారు. నందిగామ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని నందిగాం మండల ఎంపీపీ నడిపూరి శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనపై గ్రామాల్లో మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నీలవేణి, కల్లాడ సర్పంచ్ మడపాల తిరుపతిరావు, ఐకెపి సిబ్బంది, ఏఎన్ఎంలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జెండర్ ఆధారిత హింసను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

విశాలాంధ్ర-మందస : జెండర్ ఆధారిత హింసను ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. శనివారం సెర్ప్ -వైకెపి ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మండల మహిళా సమాఖ్య సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ భయం, వివక్ష, హింస లేని జీవితాల కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబరు 22వ తేదీ వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సి. హెచ్.యల్లమ్మ లక్ష్మణమూర్తి, మండల మహిళా సమాఖ్య కోశాధికారి విజయమ్మ, సిసిలు, వివోఎలు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ

విశాలాంధ్ర-మందస :మండలం బాలిగాం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఒక లారీ అదుపు తప్పి పొదల్లోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు డ్రైవరు, క్లీనరు క్షేమంగా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఉప విద్యాశాఖాధికారి తనిఖీ

విశాలాంధ్ర-మందస: మండలం వీరగున్నమ్మపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం టెక్కలి ఉప విద్యాశాఖాధికారి పగడాలమ్మ సమగ్ర తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు ఎర్రన్నాయుడును వివరాలను అడిగి సేకరించారు. విద్యార్థుల విద్యాప్రగతిపై ఆరా తీసారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట మందస మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు, మామిడిపల్లి ప్రధానోపాధ్యాయులు ఆర్.ఆనంత రావులు ఉన్నారు.

దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు 104ను సద్వినియోగంచేసుకోవాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: 104 వాహనం ద్వారా ప్రతి నెల ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయటం జరుగుతుందని దీనికి దీర్ఘకాల వ్యాధి గ్రస్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. శనివారం మేజరు పంచాయతీ పరిధిలో గల హడ్కొకాలనీలో 104 వాహనం ద్వారా రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ షుగర్, బిపి తదితర దీర్ఘకాలిక రోగాలకు మందుల కోసం నెలకు వేలలో ఖర్చు అవుతుందని, అదే 104 వాహనం ద్వారా వైద్యులు ఆదే మందులు ఉచితంగా అందజేయటం జరుగు తుందని దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

భవన నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తి చేయండి

ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి

విశాలాంధ్ర-నందిగాం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలలో భాగంగా సచివాలయ భవనాలు రైతు భరోసా వెల్నెస్ సెంటర్స్ నిర్మాణ పనులను త్వరితగతిని పూర్తి చేయాలని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి కోరారు. శనివారం నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో గుత్తేదారులతో జరిగిన సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులు కోరారు. ఇంజనీరింగ్ అధికారులు గుత్తేదారులకు సకాలంలో పనులు రికార్డింగ్ చేసి సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారి సంతోష్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, సర్పంచులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్. అంబేద్కర్ అశయాలను కొనసాగించి ఆయన అడుగుజాడల్లో మనమందరం ముందుకు పోదామని స్థానిక మండల విద్యాశాఖాధికారులు సంపతిరావు అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు డబ్బీరు గోవిందరావు అధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావుతో కలిసి వీరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అవిష్కరించారు. ఎస్. సంజీవరావు, బి. రమేష్, ఎన్. ఉషారాణి, యు. నిర్మల, జి. శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, అచ్చెమ్మ, బి.ఆదినారాయణరావు తదితర ఉపాధ్యాయుల ఆర్థిక సహాయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బి. సురేష్, మేమున్నాం సంస్థ సభ్యులు కోరాడ సాయి బృందం, ఉపాధ్యాయులు కెఆర్‌కె రవికాంత్‌రెడ్డి, చలపతిరావు, ఆనందరావు, ఎర్రన్నాయుడు, విజయలక్ష్మి, వాసుదేవరావు, రమణమూర్తి, తారక రామారావు, నీరజ, భవాని, హైమావతి, మాధురి, సన్యాసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-మందస : మండలం బేతాళపురం గ్రామానికి చెందిన బైపల్లి సూర్య ఉపాధి కోసం బెంగుళూరు వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పవన్‌పుత్ర సేవా సంస్థ సభ్యులు 45వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబానికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మజ్జి భాస్కరరావు మాట్లాడుతూ బైపల్లి సూర్య భార్య కూడా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారని, ఇద్దరు ఆడ పిల్లలను కూలీ పనులు చేస్తూ వచ్చిన సంపాధనతో హరిపురంలో గల ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నారని తెలిపారు. వారిలో ఒకరు పవన్ పుత్ర సేవా సంస్థ సభ్యురాలుగా పని చేస్తున్నారని, ఆ కుటుంబానికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో ఆర్థిక సహాయం చేశామన్నారు. విద్య, ఉద్యోగ పరంగా ఏ సహాయం కావాలన్నా సూర్య కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కె.పాల్గుణ, ఎంపిటిసి సూరాడ వాసుదేవరావు, రుంకు తారకేశ్వరరావు, కొంచాడ సత్యవీర్, ఎరుకోల సోమేశ్వరరావు, బి.శివ, టి.వినోద్, ఎన్.అనిల్, కంచరాన అనిల్, ఆనంద్, పైల నాగార్జున, జి.గంగోత్రి, మహేశ్వరి, డి.బాను, ఈ.మాధురి, షన్ముఖరావు, భాస్కరరావులు పాల్గొన్నారు.

మహిళా సమైఖ్య అధ్వర్యంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పాతపట్నం : మండల కేంద్రంలో శనివారం మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఎం కరుణాకర్ రావు మాట్లాడుతూ లింగ ఆధారంగా భయము వివక్ష మరియు హింస లేని జీవితం కోసం నిర్మాణాత్మక అడ్డంకులను పరిష్కరించడం ద్వారా మహిళలకు మరియు లింగ విభిన్నవ్యక్తుల యొక్క ఖండన గుర్తింపు ఏజెన్సీ, హక్కుల అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం నవంబర్ 25 నుండి డిసెంబర్ 22 వరకు నాలుగు వారాల కార్యక్రమం వహించుటకు ప్రణాళిక వేయడం జరిగింది. మొదటి వారం జెండర్ ఆధార హింస రెండో వారం బాల్యవివాహాలపై మూడో వారం రక్తహీనత పై నాలుగో వారం బాలికల విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మణిరత్నం, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, జెడ్పీటీసీ లింగాల ఉషారాణి, వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్, ఎంపీటీసీలు పోలాకి రేణుక, కొండల ఎరకయ్య, సర్పంచ్ ప్రతినిధి శీర్ల జోగారావు, సీర్ల ప్రభాకర్ రావు,హెచ్ డి సి సి శ్రీధర్, సీసీలు టి ధర్మారావు, కృష్ణవేణి, ప్రభావతి, లక్ష్మీరాజ్యం, మీనాక్షి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పశువులపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి

పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పశువులకు మేతకు బయటకు వెళ్ళినప్పుడు అవి ఏమి తింటున్నాయన్నది పాడిరైతులు గమనించాలని, పశువులు తినకూడనవి తింటే వాటి ప్రాణానికే ప్రమాధమని పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలం యలమంచిలి గ్రామానికి చెందిన వేసవి వైకుంఠరావుకు చెందిన ఆవు గతవారం రోజల నుంచి ఆనారోగ్య సమస్యతో బాధపడుతుండడంతో పాడిరైతు డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సంప్రదించగా ఆయన ఆవుకు వైద్యం అందించటంతో శుక్రవారం అవునోటి నుంచి కరెంట్‌తీగ ముక్కలు ముద్దలుగా పడ్డాయి. రాత్రి ఆకస్మికంగా కడుపు ఉబ్బరం రావటంతో డాక్టర్ వెంటనే అవును పరిశీలించి శస్త్రచికిత్స చేశారు. పొట్టని కోసి పొట్టలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్ధాలు, అంట్లుతోమే స్టీల్ స్క్రబ్బర్ ముక్కలు, ప్లాస్టిక్ సంచులు, తాళ్ళు ముక్కలని తీశారు. దీంతో అవు క్షేమంగా ఉంది. దీంతో పాడిరైతు, గ్రామస్థులు డాక్టర్ కిరణ్‌కుమార్‌ను అభినందించారు.

రాజ్యాంగం గొప్పది...

విశాలాంధ్ర-హిరమండలం: జాతీయ రాజ్యాంగ దినోత్సవము నవంబర్ 26 ను పురస్కరించుకొని శనివారం మండలం లోని ఆవలింగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుల జీ రమేష్ ఆధ్వర్యంలో భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన దినంను భారత రాజ్యాంగ దినముగా జరుపుకుంటున్నామని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం విలువలను తెలియజేస్తూ సోషల్ టీచర్ జయ క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ లో మదన్మోహన్ బృందం ప్రథమ స్థానము, శ్రీవిద్య బృందం ద్వితీయ స్థానం బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయరావు, కృపానందం, మాధవరావు, రమణమూర్తి, గిరిబాబు, రత్నకుమార్, సత్యనారాయణ లు పాల్గొన్నారు.

సమాన దృక్పథంతో చూడాలి... ఏపీఎం లలిత

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ప్రస్తుత సమాజంలో లింగ వివక్షతను విడనాడి సమాన దృక్పథంతో చూడాలని వెలుగు ఏపీఎం లలిత అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలబాలికలను సమాన దృక్పథంతో చూడాలన్న ఉద్దేశంతో మెళియాపుట్టి మండల కేంద్రంలో లింగఆధారిత హింసకు అనే కార్యక్రమన్ని తహశీల్దారు సరోజిని, ఎంపిడిఓ చంద్రకుమారిల ఆధ్వర్యంలో ఏపీఎం లలిత శనివారం నిర్వహించారు. దీంట్లో భాగంగా పలువురు మహిళలతో కలిసి మూడు రోడ్ల కూడలి వరకు బాలబాలికలను సమానంగా చూడాలి, ఇంటికి దీపం-ఇల్లాలు, పలు నినాదాలతో ర్యాలీని నిర్వహించి మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలను సమానంగా చూడాలని, బాలికలను బాలురతో సమానంగా చదివించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు) శ్రీకాకుళం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి సురేఖ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26 సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ పూలమాల అలంకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భారత రాజ్యాంగం రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క సేవలను కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ అధ్యక్షతన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు చిరంజీవిరావు భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం అని. మన రాజ్యాంగంలో 22 భాగాలు 448 ఆర్టికల్స్ 12 షెడ్యూల్ ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, కళాశాల ఐ క్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ హరిత, ఎన్సిసి ఆఫీసర్ డాక్టర్ పోలినాయుడు, పొలిటికల్ సైన్స్ ఇన్ ఛార్జ్ సి. హెచ్ .రామమూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లు శ్రీనివాస పాత్రో, వెంకట చలమయ్య వెంకటేశ్వర్లు, టీసీడీఈ కోఆర్డినేటర్ వంశీ కుమార్, కళాశాల వివిధ భాగాల అధిపతులు మరియు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సాంఘికశాస్త్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లిలో సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన,వక్తృత్వం క్విజ్ పోటీలు నిర్వహించారు. గాంధీ,జవహర్లాల్ నెహ్రూ అంబేద్కర్ వేషధారణలతో విద్యార్థుల ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్.అనురాధ, కె.దాలయ్య, ఽ.నారాయణరావు, పి.చిన్నరావు, పి.ఋషి, బి.ఆనంద రావు, భారతి, టి.వైకుంఠరావు, ఎస్.దుర్గారావు, బాడాన నారాయణరావు పాల్గొన్నారు.

'సిరిపురం' సహాయాన్ని కోరిన మెగా లిఫ్టిరిగేషన్ నిర్మాణ సంస్థ

స్పందించి సాంకేతిక లోపాన్ని సరిదిద్దిన 'సిరిపురం తేజేశ్వరరావు'

విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు మండలంకు భౌగోళికంగా కలిసున్న ఒడిస్సా గజపతి జిల్లా కిడిగాం వద్ద వంశధార నదిపై ఆ ప్రభుత్వం నిర్మించిన భారీ ఎత్తిపోతల పథకం ఇటీవల సాంకేతిక లోపం తలెత్తి తన సామర్థ్యాన్ని తగ్గుతూ వచ్చింది. ఈ లిఫ్టిరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ జీవిఆర్ నిర్వాహకులు గతంలో తమకు ఇంజినీరింగ్ ఉన్నతాధికారిగా పరిచయాలున్న ఇంజినీరింగ్ రంగంలో విశేష అనుభవాలున్న విద్యావేత్త, పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు సహాయాన్ని ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ కోరింది. ఇందుకు స్పందించిన సిరిపురం శనివారం కిడిగాం లిఫ్టిరిగేషన్‌ను పరిశీలించారు. లోపాన్ని గుర్తించి వారికి తగు సూచనలు ఇచ్చారు.

మోడల్ స్కూల్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పాతపట్నం : మోడల్ స్కూల్‌లో శనివారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి పుష్పాలంకరణ చేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ ప్రపంచంలోనే అతి పెద్దదైన రాజ్యాంగాన్ని నిర్మించారని అతని అడుగుజాడలలో విద్యార్థులు అందరూ నడుచు కోవాలని పిలుపునిచ్చారు. ఆర్. మోహన్‌రావు, వై.నీలయ్య, రాజేంద్రప్రసాద్‌వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ టీచర్ కే.రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు, ఇతర ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రాట్ ప్రూఫింగ్ మోడల్స్ వేసుకోవాలి

ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారులు ప్రకాష్, హేమ సుందర్

విశాలాంధ్ర-ఆమదాలవలస : జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం పై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి అధ్యక్షతన సిబ్బందికి రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పై సిబ్బంది రైతులకి క్షేత్ర స్థాయిలో పూర్తిగా కలిసి పనిచేయాలని, అలాగే రైతులకి అదనపు ఆదాయం వచ్చేలా పలు పంటలు పద్ధతులు, అలాగే వర్షాధార పరిస్థితుల్లో డ్రాఫ్ట్ ప్రూఫ్ మోడల్స్ వేయించి ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రీయతను రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి.పి.యం ధనుంజయ్ మరియు సిబ్బంది శివకృష్ణ, శ్రీనివాస్, గోవింద్ రెడ్డి, శివాజీ, ముసలయ్య, వెలుగు సిబ్బంది పి.నారాయణరావు, వైకుంఠరావు, ఈశ్వర రావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు... పైరవీలకు తావు లేదు

శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస: అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నా రన్నారని, నిరుపేదల గౌరవాన్ని పెంచేలా జగన్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యుల పేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి ఏ మేరకు చేకూరు తుందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ఆలోచన, ఆశయానికి ప్రతిరూపంగా ఉన్న గడప గడపకు మన ప్రభుత్వ లక్ష్యం ఉద్దేశాన్ని ఆయన ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గురుగుబెల్లి ప్రభాకర్ రావు పి ఏ సీ ఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు,గురుగుబెల్లి నీలారావు, కుటికుప్పల సన్యాసిరావు తదితర వైయస్సార్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా భారత సంవిధాన్ దివస్

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని పి వై జి పుట్టుగ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ ఆధ్వర్యంలో భారత్ సంవిధాన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిఆర్ అంబేద్కర్,బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాల వేసిన అర్పించారు. అనంతరం దేవదాసు మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సమ్మిదాన్ దివాస్ గా పిలుస్తారని అన్నారు.మనదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 26వ తేదీన సంవిధాన్ దివస్ జరుపుకుంటారని తెలిపారు. 1949 వ సంవత్సరంలో రాజ్యాంగ సభ ద్వారా రాజ్యాంగాన్ని ఆమోదించింది. కానీ రాజ్యాంగం అధికారికంగా1950 జనవరి 26వ తేదీ న పనిచేయడం ప్రారంభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయిని పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- రాజపురం ఆదర్శ పాఠశాలలో... మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు నమూనా పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి పాల్గొని రాజ్యాంగము యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. ఈశ్వరరావు ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు.మాక్ పార్లమెంట్ నిర్వహించినందుకు సోషల్ ఉపాధ్యాయులైన అరసాడ. బాబూరావు, శంకా రమేష్ లను అభినందించారు.విద్యార్థులు ఆధ్వర్యంలో అధికార పార్టీ -ప్రతిపక్ష పార్టీ వాదనలు విని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని తెలిపారు.నేటి ప్రపంచంలో మగవారితో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారని అన్నారు.ప్రతి సంవత్సరము నవంబరు 25 న స్త్రీల హక్కుల పరిరక్షణ,స్త్రీ హింసా వ్యతిరేక దినముగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.ఈ సందర్భంగా కవిటి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేసి మానవహారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ,కర్రి గోపయ్య,పిఏసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్,ఈటీపిఆర్డి శివాజీ పాణిగ్రహి,మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి,ఏపిఎం గోవింద్,ఏ పీ ఓ భాస్కరరావు,ఐసిడిఎస్ సూపర్వైజర్లు పల్లవి,కృష్ణవేణి,వివో ఏలు, అకౌంటెంట్ సుహాసిని,సచివాలయ మహిళా పోలీసులు అంగన్వాడి కార్యకర్తలు,సి ఎఫ్ లు,సీసీలు మహిళా సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 16, 21, 24 డివిజన్ లకు సంబంధించి పోలింగ్ బూతులు 171, 172, 186, లలో గల ప్రజలకు "బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారెంటి" కార్యక్రమన్ని స్థానిక భాకర్ షాహెబ్ పేట టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో 16, 21, 24, డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి లు, ఎస్‌వీ రమణ మాదిగ, పాట్నాల పార్వతీశం, సిరిపురం హరి లతో పాటు 171,179,186., బూత్ ఇన్‌చార్జి లు సూర్య ప్రసాద్ దొర, ఆశిరమ్మ, లొట్టి సూరిబాబు, డివిజన్ నాయకులు బసిన వెంకటేష్, షణ్ముఖ్, టెక్నికల్ పర్సన్ శ్రీనివాస రావు లు డివిజన్‌లో ప్రతీ ఇంటి కి వెళ్లి తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ను రాబోయే 2024 ఎన్నికలలో గెలిపిస్తే.. ప్రజలకు సంవత్సరానికి 3 వంట గ్యాస్ సిలిండర్స్ ఉచితంగా ఇస్తారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.15వేలు, ప్రతి ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువు కొంటే అంత మంది కి సంవత్సరానికి రూ.15వేలు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. అలాగే ఇలాంటి పథకాలు మరెన్నో అమలవుతాయని ప్రజలకు తెలియ జేశారు.

స్కూల్ కాంప్లెక్స్‌లో శాస్త్రీయ విధానం ఉండాలి - ఎస్ టి యు వినతి

విశాలాంధ్ర-ఆమదాలవలస: సబ్జెక్ట్ స్కూల్ కాంప్లెక్స్ లో శాస్త్రీయ విధానం లోపించిందని మొదటి వలే మండల లేదా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే విధంగా పునర్విభజన చేయాలని ఎస్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పడాల తమ్మి నాయుడు, ఎస్ వి రమణ మూర్తి కోరారు. శనివారం అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి జయరాంకు వినతి పత్రాన్ని అందించారు. పదవ తరగతి పరీక్షలు తేదీలు దగ్గర పడుతున్న పరీక్షా కేంద్రాలుగా ఉన్న ఉన్నత పాఠశాలలను నాడు నేడు ఫేజ్ టు పనులు త్వరితగతిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ముందుగా సెక్టోరియల్ అధికారులుగా నియమితులైన వారిని ఎస్టియు సంఘం తరపున అభినందించారు. పది సంవత్సరాల పాటు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, ఫ్యాప్టో చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించి ఇటీవల సర్వ శిక్ష అభియాన్ శ్రీకాకుళం జిల్లా ప్రాజెక్టు కమ్యూనిటీ మొబైల్ జేషన్ అధి కారిగా బాధ్యతలు చేపట్టిన పేడాడ ప్రభాకర్ రావును ఎస్టియు జిల్లా శాఖ అభినందిం చింది. అలాగే బై జ్యూస్ జిల్లా నోడల్ ఆఫీ సర్ జి భాస్కర్ రావుకు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారా యణ, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ గా నియా మకం పొందిన వెలమల ఉమా లను జిల్లా శాఖ అభినందన తెలిపింది.

యాన్యువల్ ప్లాన్ సిద్ధం చేయండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : శనివారం స్థానిక మండల రిసోర్స్ భవనంలో ఎం.ఈ.ఓ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సుమారు 70మంది ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతు పాఠశాలల అభివృద్ధి, పాఠ్య ప్రణాళికలకు సంబంధించిన వివరాలను క్రమ పద్ధతిలో తయారు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్కూల్ కాంప్లెక్స్‌ల ప్లాన్లను మండల యూనిట్‌కు అందిస్తే జిల్లా కేంద్రానికి పంపటం జరుగుతుందని, ప్రతీ ఒక్కరు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించిన ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు.

బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధింపు

పోక్సో కేసుల విచారణలో క్రియాశీలకంగా విజయనగరం జిల్లా న్యాయ యంత్రాంగం
వేగవంతమైన విచారణ ప్రక్రియలతో బాధితులకు సత్వర న్యాయం

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం జిల్లా కోర్టు సముదాయాల పరిధిలోని బాలలపై అఘాయిత్యా లను విచారించే పోక్సో న్యాయస్థానం రెండు నెలల వ్యవధిలో బాలలపై అఘాయిత్యాలకు సంబంధించిన 20 కేసులను పరిష్కరించడమే కాకుండా ఈ కేసుల విచారణలో భాగంగా 8 మంది నిందితులుగా నిర్ధారణ జరిగిన వారికి కఠిన కారాగార శిక్షలు విధిస్తూ తీర్పులు వెలువరించింది. దీనితోపాటు అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులకు గరిష్ట శిక్షలు విధించడం ద్వారా బాలలపై అఘాయిత్యాలను సహించేది లేదని గట్టి హెచ్చరికను పంపినట్లయింది. అఘాయిత్యానికి గురైనా బాలలకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం మంజూరుకోసం కూడా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర హైకోర్టు జారీచేసిన ఆదేశాల ప్రకారం బాలలపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో ఛార్జిషీటు దాఖలైన నాటి నుంచి రెండు నెలల్లోగా ఆ కేసును పరిష్కరించి తీర్పు ఇవ్వాల్సి వుంటుంది. బాలలపై అఘాయిత్యాలను విచారించే న్యాయస్థానం(పోక్సో) కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా ఈ ఏడాది సెప్టెంబరు 25న బాధ్యతలు చేపట్టిన న్యాయాధికారి కె.నాగమణి యుద్ధ ప్రాతిపదికన కేసుల విచారణ చేపట్టి రోజువారీగా 10 నుంచి 15 మంది సాక్షుల విచారణ చేయడంతో కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి సూచనల మేరకు పోక్సో కేసుల విచారణను ప్రత్యేక శ్రద్ధతో చేపట్టి ఈ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందనే భరోసాను కల్పించడంలో పోక్సో న్యాయమూర్తి నాగమణి సఫలీకృతులయ్యారు. సకాలంలో విచారణ పూర్తయ్యేందుకు ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు సాక్షులను సరైన సమయంలో కోర్టులో ప్రవేశపెట్టి విచారణ వేగవంతం అయ్యేందుకు సహకరించగా, త్వరగా తీర్పులు వెలువ రించేందుకు, సత్వర న్యాయం అందించేందుకు ఇది తోడ్పడింది. కేసు నమోదైనప్పటి నుంచి నిందితులపై కోర్టులో ఛార్జిషీటు వేసేవరకు విజయనగరం, పార్వతీ పురం జిల్లాల పోలీసు సూపరింటెండెంట్‌లు దీపిక, విక్రాంత్ పాటిల్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పోక్సో కేసులను పర్యవేక్షించడంతో పాటు తమ సిబ్బందికి ఈ కేసుల్లో దిశానిర్దేశం చేస్తూ చేపట్టిన చర్యలు విచారణ ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు దోహదపడుతోంది. జిల్లాలో పోక్సో కోర్టు క్రియాశీలకంగా వ్యవహరించడంతో ఈ ఏడాది నమోదైన ఒక కేసులో త్వరగా విచారణ పూర్తిచేసి నవంబరు 24న పోక్సో న్యాయస్థానం కేసులో నిందితుడైన గుర్ల మండలం పెనుబర్తికి చెందిన యాళ్ల గణపతి అనే నిందితుడికి 45 ఏళ్ల గరిష్ట జైలుశిక్షను విధించింది. ఈ కేసులో బాధితురాలైన మైనర్ బాలికకు రూ.5 లక్షలు పరిహా రంగా చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ఇందులో రూ.1.50 లక్షలు వెంటనే అందించాలని, మిగిలిన మొత్తాన్ని తర్వాత చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

డిసెంబర్ 7న బీసీల పోరాట రథయాత్ర ప్రారంభం

పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి

విశాలాంధ్ర-పలాస: దేశానికి స్వాతంత్రం వచ్చి దశాబ్దాల గడుస్తున్న బీసీలకు సమన్యాయం జరగలేదని, బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర పోరాట రథయాత్రను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతిరాజు పేర్కొన్నారు. డిసెంబర్ 7న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కానున్న రథయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు 90 అసెంబ్లీ నియోజకవర్గలు, 13 పార్లమెంటు స్థానాలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ పార్టీలు 275 పార్లమెంటు స్థానాలను బీసీలకు కేటాయించాలని ఎజెండాతో ఈ పోరాట రథయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగనన చేపట్టాలని, బీసీలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఉత్పత్తి కులాలుగా ఉన్న కులవృత్తులు నేడు ఉత్తుత్తి కులాలగా పాలకులు మార్చారని చెప్పారు. రాజకీయ అధికారమే అన్నిటికి మూలాధారమని, బీసీలకు రాజ్యాధికారం కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి బడుగు బలహీన వర్గాల చెందిన వ్యక్తులు బీసీల పోరాట రథయాత్రలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘ నాయకులు అమరుల్లా బెగ్, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, గొర్రెలు మేకలు సహకార అభివృద్ధి సమైక్య జిల్లా అధ్యక్షులు రాపాక చిన్నారావు, పాలీన ప్రసాద్, తిప్పనా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యము కొనుగోలు బాధ్యత వ్యవసాయ సహాయకులదే...

- వ్యవసాయ సహాయ సంచాలకులు మధుబాబు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: గ్రామాలలో ఉన్న ఆయా రైతు భరోసా కేంద్రాలే ధాన్యం కొనుగోలు కేంద్రలుగా కీలక భూమిక పోషించనున్న తరుణంలో ధాన్యం కొనుగోలు బాధ్యత ఆయా ఆర్బికెలోనున్న వ్యవసాయ సహాయకులదేనాని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల వెంకట మధుబాబు అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి తహసిల్దార్ కార్యాలయంలో శనివారం గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు, టెక్నికల్ అసిస్టెంట్ల, డేటాఎంట్రీ ఆపరేటర్లతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు భరోసా కేంద్రాన్ని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రంగా మార్చిందని, ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల మేరకు ధాన్యంలో తేమ తదితర నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని మిల్లులకు పంపించవలసిందిగా వారికి సూచించారు. తహసిల్దార్ సరోజినీ మాట్లాడుతూ ప్రభుత్వం వీఆర్వోలను గ్రామ కస్టోడిన్ అధికారులుగా నియమించిందని మిల్లుల వద్ద మిల్లర్ల నుంచి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారులదేనన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆయా ఆర్.బి.కెలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏడీ మధుబాబు తోపాటు తహసిల్దార్ సరోజినీ, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ భీమారావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వైకుంఠరావు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు తదితరులున్నారు.

28న సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-ఆమదాలవలస : నియోజకవర్గంలోని నాలుగు మండలాల సర్పంచుల ఆత్మీయ సమ్మేళన సమావేశం ఈనెల 28న మంగళవారం స్థానిక ఎస్ ఎస్ ఎన్ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని నియోజ కవర్గ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతి రావు తెలిపారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గుండ శంకర్రావు ఆధ్వ ర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళన సమా వేశం నిర్వ హించబడునని నియోజకవర్గంలోని సర్పంచు లంతా హాజరై వారు ఎదుర్కొంటు న్న సమస్యలను వివరించాలన్నారు. వీట న్నిటిని ప్రణాళిక బద్ధంగా జిల్లాలో జరిగే సమావేశంలో పొందు పరచ నున్నామని గౌరీ పతి రావు వివరించారు.

దళిత కుటుంబాలకు మౌళిక వసతులు కల్పించండి

విశాలాంధ్ర-పాతపట్నం : మండలంలోని సింగపురం గ్రామంలో సుమారు 40 దళిత కుటుంబాలు నివశిస్తున్నాయని, వారికి సరైన మౌళిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీరికి మౌళిక వసతులు కల్పించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి తహశీల్దార్‌ను కోరారు. శనివారం దళిత కుటుంబాల సమస్యలపై వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కుటుంబాలకు శ్మశాన వాటిక లేదని, వారు నిశిస్తున్న వీధుల్లో రోడ్లు సరిగా లేక, తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఇంట్లో ఏవైనా శుభకార్యాలు జరిగితే అవి జరిపేందుకు స్థలం కూడా లేదని, దళిత కుటుంబాలకు కమ్యూనిటీ హాల్‌ను గ్రామంలో నిర్మించాలని, మౌళిక వసతులు కల్పించాలని ఆయన వినతి పత్రంలో కోరారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో మీసాల వెంకటరావు, కోన చిన్నారావు, పొన్నాడ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ పథకాలతో పండుగ సంతోషాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పథకాలతో పండుగ సంతోషాలు ప్రతి ఇంటా,ప్రతి ఒక్కరిలో తీసుకు వచ్చామని,సంక్షేమానికి సరికొత్త నిర్వచనం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన అని యువ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర విభాగ అధ్యక్షులు చౌదరి సతీశ్ అన్నారు. ఆదివారం పేట, శాంతి నగర్ కాలనీలలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు యువ నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు (చిన్నీ) కూడా ఈ కార్యక్రమానికి హాజరయి శ్రేణులలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా చౌదరి సతీశ్ మాట్లాడుతూ.. "గతంలో కన్నా ఇప్పుడు పాలనలో వచ్చిన మార్పులు చూడండి. అవి క్షేత్ర స్థాయిలో ఏ విధంగా ప్రజా జీవితాలను ప్రభావితం చేస్తున్నాయో అన్నది గమనించండి. పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చాం. సంక్షేమ పథకాలతో జీవితాలను మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. దీంతో మంచి రోజులు వచ్చేయి అనేందుకు నిదర్శనంగా ఇవాళ అంతా ఉన్నారు. ఒకప్పుడు జన్మభూమి కమిటీలు చెబితేనే పథకాలు అందేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. "ఒక్క రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా, మంత్రి ధర్మాన దిశానిర్దేశం మేరకు అంతా పనిచేస్తున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధనకు అంతా కృషి చేస్తూ ఉన్నాం. తారలు ఎన్ని ఉన్నా చంద్రుడొక్కడే అన్న విధంగా రాష్ట్రంలో ఎందరు ముఖ్యమంత్రుల పాలన వచ్చినా జగన్ పాలన ఒక్కటే నీతికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఆయన సరికొత్త చరిత్రకు నాంది పలికిన వైనం చిరస్మరణీయం. ఒకప్పుడు ఏ చిన్న పని జరగాలన్నా నాయకుల ఇళ్ల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. కానీ ఇప్పుడు పాలనను మరింత స్థానికం చేసి,అందరికీ పథకాలు వర్తింపజేస్తున్న తీరుకు విపక్షాలు కూడా ఫిదా అవుతున్నాయన్నారు. నేడు నేరుగా పథకాల ఆర్థిక లబ్ధిని ఖాతాల్లోకి జమ చేయడం కారణంగా ఇవాళ మధ్యవర్తుల ఊసే లేకుండా పోయిందన్నారు. "దేశ చరిత్రలోనే ఇదొక సువర్ణ అధ్యాయం అన్నారు. "పాలనను మరింత స్థానికం చేసేందుకు సచివాలయ వ్యవస్థ రాక ద్వారా ఎందరో యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు అన్నవి దక్కేయన్నారు. వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారంపేట, శాంతి నగర్ కాలనీల సచివాలయాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను సతీశ్, చిన్నీ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని రెండు చోట్లా చిన్నీ ఆవిష్కరణ చేశారు.

ధనుంజయ బృంధానికి సన్మానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి పుణ్యక్షేత్రం సింహాచలంలో స్వామి సన్నిధిలో మండలంలో టి. భరంపురం గ్రామానికి చెందిన తిప్పన ధనంజయ రెడ్డి బృందం సంగీత విభావరి అత్యంత వైభవంగా నిర్వహించింది. కళావేదిక ఇంచార్జి మారుతీ రావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆల్ ఇండియా కళా రంగం ఎగ్జిక్యూటివ్ నెంబర్ (ఆంధ్ర ప్రదేశ్), నాట్యబ్రహ్మ అవార్డు గ్రహీత తిప్పన ధనంజయ కీబోర్డు, వయోలిన్‌పై సంగీత విన్యాసానికి తోడుగా గాత్రంపై ఆల్ ఇండియా కళా రంగం శ్రీకాకుళం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ధనావతి, కతిల రుక్మిణి, పటాన రాహిత్య, మృదంగంపై చలపరాయి వినోద్ కుమార్ సహకరించారు, ధనుంజయ బృంధంలోని సంగీత కళాకారులను ఆలయ సిబ్బంది, అధికారుల ఘనంగా సత్కారించారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం సన్నిధిలో కార్యాక్రమాన్ని నిర్వహించి తమ సంగీత కళను ప్రదర్శించే అవకాశం దక్కడ అదృష్టమని ధనుంజయ ఈ సందర్భంగా అన్నారు.

బి.సి నియోజకవర్గ అధ్యక్షునిగా త్రినాధ్

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జాతీయ బి.సి సంక్షేమ సంఘం ఇచ్ఛాపురం నియోజకవర్గం అధ్యక్షుడిగా బుడ్డేపు త్రినాధ్ నియమితులయ్యారు. గత 4 సంవత్సరాలుగా బి.సి ఉద్యమాలలో క్రియాశీల పాత్రపోషించిన అతన్ని నియమిస్తు రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు జారీ చేసిన ఉత్తర్వులను జిల్లా అధ్యక్షులు పిట్ట చత్రపతి అందజేసారు. బి.సిల సంక్షేమం కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని ఈ సందర్భంగా త్రినాధ్ అన్నారు. త్రినాధ్ నియామకం పట్ల పి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్రతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

200 మందికి ఉచిత వైద్యం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : 17వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుడు కర్రి నాగరాజు ఆధ్వర్యంలో సంతపేటలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది 200మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపి ఔషధాలను అందజేసారు. వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దాసరి రాజు సందర్శించి అభినందించారు.

అగ్నిబాధితుల పట్ల శ్రీను ఔదార్యం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఇటీవల మూడు పూరిళ్లు దగ్ధమైన విషయం తెల్సిందే. బాధిత కుటుంబాల పట్ల సోంపేట రోటరీక్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తన ఔదార్యాన్ని చూపారు. అలాగే రోటరీ సభ్యులు మల్లా నాగేంద్ర, బరాటం సతీష్ సహకారంతో బాధితులకు నిత్యావసర సరుకులు, బట్టలు, దుప్పట్లు, టార్పాన్లు, బియ్యం ప్యాకెట్లు, చాపలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ కోశాధికారి కె.రవికుమార్, సానా సంతోష్ పాల్గొన్నారు.